క్లుప్తంగా

మిత్రుల కుటుంబానికి చేయూత


సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తల్లాడ: తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు తమ తోటిమిత్రుల కుటుంబాలకు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మండలకేంద్రానికి చెందిన బోలే షావలీకీ పూర్వ విద్యార్థులు విరాళాలు సేకరించి రూ.80 వేలు అందజేశారు. అదేవిధంగా అన్నారుగూడెంకు చెందిన యూనివర్సల్ ఉపాధ్యాయుడు ప్రసాద్ ఇటీవల మృతిచెందగా ఆయన భార్య మతిస్థిమితం సరిగా లేక ఇబ్బంది పడుతోంది. దీంతో ప్రసాద్ భార్య వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30,500 సేకరించి యూనివర్సల్ ప్రిన్సిపాల్ టీ.కె.ప్రసన్నన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నీలం కిరణ్, మొక్కా సైదులు, సుధారాణి, జంగాల సుభాషిని, జవ్వాజి నగేష్, చాంద్‌పాషా, రంగారావు, రఘు, వెంకటేశ్వర్లు, రాజా, నరసింహారావు, కొత్తూరు సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ


ల్యాప్‌టాప్ అందజేస్తున్న క్లబ్ నిర్వాహకులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో బీటెక్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని జి.తిలోచనకు రూ.38 వేలు విలువైన ల్యాప్‌టాప్‌ను ఆదివారం అందజేశారు. క్లబ్‌లోని కొందరు దాతలు, విద్యాభారతి జూనియర్ కళాశాల, నవభారత డిగ్రీ కళాశాల యాజమాన్యం, పీడీజీ డాక్టర్ కాపా మురళీకృష్ణ ల్యాప్‌టాప్ అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు దొడ్డా కృష్ణయ్య, కార్యదర్శి పెనుగొండ రమేష్, జీవి లింగారెడ్డి, గండ్ర సోమిరెడ్డి, జంగా సత్యనారాయణ, సింగరేణి రవి, ఒగ్గు దామోదర్ రెడ్డి, జక్కం ప్రసాద్, గోలి ప్రభాకర్‌రెడ్డి, మందడపు సత్యనారాయణ, గాదె నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ నామా పరామర్శ..


నివాళులర్పిస్తున్న ఎంపీ నామా

చింతకాని: మండల పరిధిలోని పలువురు మృతిచెందగా వారి మృతదేహాలను ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, ఏఎంసీ డైరెక్టర్ వంకాయలపాటి లచ్చయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకట్రామయ్య, గ్రామసర్పంచ్‌లు దమ్మాలపాటి శ్రీదేవి, నూతలపాటి మంగతాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

చింతకాని: పథకాల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సక్రమంగా అమలు చేయలేక కాంగ్రెస్ పార్టీపై నిందలు మోపి దిష్టిబొమ్మలను దహనం చేయటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలుచేయటం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మడుపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున్, సట్టు వెంకటేశ్వర్లు, కంభం వీరభద్రం, ఆలస్యం బస్వయ్య, వంగూరి రమేష్, పందిళ్లపల్లి ఎంపీటీసీ సభ్యులు ఓర్సు వీరభద్రం, నాగులవంచ సర్పంచ్ ఆలస్యం నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఓటెత్తుతాం..



- స్వేచ్ఛగా పోలింగ్‌లో పాల్గొంటాం
- యువ ఓటర్ల మనోగతం..
- సమర్థులను ఎన్నుకుంటామంటున్న యువత

సత్తుపల్లిటౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిది.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎన్నికల్లో ప్రలోభాలకు గురికాకుండా వేయాల్సిన బాధ్యత యువతపై ఉందని యువ ఓటర్లు తమ మనోగతం వెల్లడిస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఆన్‌లైన్‌లో కొందరు దరఖాస్తు చేసుకోగా ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలలో మరికొందరు యువత ఓటు హక్కును పొందారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా ఓటేసి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటేనే చట్టసభల్లో సమర్థులు అడుగుపెట్టే అవకాశం లభిస్తుంది.

సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల వారీగా కొత్త ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
సత్తుపల్లి	4636	3899	01	8536
వైరా	3827	3066	01	6894
మధిర	4415	3646	00	8061

ఓటు వచ్చింది..



నాకు కొత్తగా ఓటు హక్కు వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకుంటా.. మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలంటే యువత ఓటింగ్‌కి ముందుండాలి. నా స్నేహితులు కూడా ఎన్నికల్లో ఓటు వేసేలా కృషి చేస్తా.

– ఎం.నీలోత్పల, మెడిసిన్ విద్యార్థిని, సత్తుపల్లి

సమర్థులను ఎన్నుకుంటాం..



చట్టసభల్లో సమర్థులను ఎన్నుకుంటాం. ప్రజా సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేస్తాం. నిస్వార్థంగా సేవా చేస్తారనే నమ్మకం ఉన్న వ్యక్తినే ఎన్నుకుంటాం. ప్రజా స్వామ్యంలో ఓటే కీలకం.

– బి.సత్యసాయి దీక్షిత, బీటెక్, సత్తుపల్లి

సుపరిపాలన అందించాలి..



అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసే అభ్యర్థికే ఓటు వేస్తా. తొలిసారి ఓటు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి. యువత వేసే ఓటుపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఓటు హక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకుంటా.

– టి.ఉన్నతశ్రీ, బీటెక్, సత్తుపల్లి

చాలా సంతోషంగా ఉంది..



ఓటు హక్కు లభించటం చాలా సంతోషంగా ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఓటు హక్కు పొందాను. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది. యువత ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– జి.సంజన, బీటెక్, సత్తుపల్లి

ఆలోచించి ఓటు వేస్తా



ఎన్నికల్లో యువత ఆలోచించి సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలి. ప్రలోభాలకు గురిచేసేవారికి బుద్ధి చెప్పాలి. విజ్ఞతతో వేసే ఓటుతో ఎంతో మంది జీవితాలను మార్చుతుంది. సామాన్యులకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలి.

– ఎండి.షేరాజ్, బీఎస్సీ, సత్తుపల్లి

ఓటే బ్రహ్మాస్త్రం



ప్రజాస్వామ్యంలో ఓటు పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం వంటిది. మొదటిసారి నాకు ఓటు హక్కు వచ్చింది. తప్పకుండా సద్వినియోగం చేసుకుంటా. ప్రజలకు నిస్వార్థ సేవ చేసేవారిని ఎన్నుకోవాలి. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అందరు వినియోగించుకోవాలి.

– బి.బాలాజీ భార్గవ్‌గౌడ్, పెనుబల్లి

గెలిపిస్తే సేవకుడిగా పని చేస్తా..


ప్రచారం నిర్వహిస్తున్న కమల్ రాజ్

మధిర: మధిర శాసనసభ స్థానానికి జరగబోయే ఎన్నికల్లో తనను గెలిపించి ఒక్క అవకాశం ఇస్తే సేవకుడిగా పని చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్ రాజు తెలిపారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని, అదేవిధంగా మధిర గడ్డపై గులాబీ జెండా ఎగురవేసి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కనుమూరు వెంకటేశ్వరరావు, శీలం విద్యాలత వెంకటరెడ్డి, బివిఆర్, కరివేద సుధాకర్, భోగ్యం ఇందిర, బాణాల శంకరాచారి, చలువాది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు కోసం కృషి చేస్తా


మాట్లాడుతున్న బాణోత్ మదన్‌లాల్

వైరా: వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే వైరా మండలాన్ని దళితబంధు పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి బాణోత్ మదన్‌లాల్ అన్నారు. వైరాలోని 14వ వార్డులో కౌన్సిలర్ డాక్టర్ డి.కోటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో బాణోత్ మదన్‌లాల్ మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, నాయకులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, పమ్మి తిరుమలరావు, మాదినేని ప్రసాద్, ఆదినారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి: మండలంలో మాజీ ఎమ్మెల్యే, వైరా బీఆర్ఎస్ అభ్యర్థి బాణోతు మదన్‌లాల్ ఆదివారం పర్యటించారు. అంతకుముందు ఉసిరికాయలపల్లి, గిద్దవారిగూడెం గ్రామాల్లో పర్యటించి ఓటు వేయాలని పలువురిని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, హన్మకొండ రమేష్, ఉన్నం వీరేందర్, నర్సింగ్ శ్రీనివాసరావు, వైఎస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జడల వసంత, ఉప సర్పంచ్ మణికొండ నాగేశ్వరరావు, షేక్ గౌసుద్దీన్, భూక్యా చందూ, పేర్ని వెంకటేశ్వర్లు, ఆదెర్ల రామారావు, చెవులు చందూ, సోమందుల నాగరాజు పాల్గొన్నారు.

ముస్లింలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న ఖాషీ

మధిర: ముస్లింలు అన్ని రంగాల్లో రాణించాలని ముస్లిం ఐక్య సంఘం నాయకులు ముఫ్తి ఆదాం ఖాషీ కోరారు. మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల పరిధిలోని ముస్లిం సంఘాల బాధ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మసీదులను ఏర్పాటు చేసి ఇమాములను నియమించడం, బాల బాలికలకు ధార్మిక విద్యను బోధించడం వంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాల ముస్లిం కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అఫ్రోజ్ సాహెబ్, జమీర్, షేక్ గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు మనోస్థైర్యం కోల్పోవద్దు


మాట్లాడుతున్న రాందాస్ నాయక్

వైరా: కార్యకర్తలు ఎవరూ మనోస్థైర్యం కోల్పోవద్దని వైరా అసెంబ్లీ నియోజకవర్గంలో తప్పక కాంగ్రెస్ అభ్యర్థి పోటీలో ఉంటాడని టీపీసీసీ సభ్యుడు మాళోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఆదివారం వైరాలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వైరా సీటు పొత్తుల్లో భాగంగా వామపక్షాలకు కేటాయిస్తున్నారనడంతో వాస్తవం లేదని, పదేళ్లుగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ వస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేయబోయే ఆరు గ్యారంటీలను కార్యకర్తలు ఇంటింటికీ ప్రచారం చేసి పార్టీని అధికారంలోకి తీసుక వచ్చేందుకు కృషి చేయాలన్నారు. అధికారులు తక్షణమే వైరా రిజర్వాయర్‌ను సాగర్ జలాలతో నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏదునూరి సీతారాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, పాదిల హరినాద్, పాలేటి నరసింహారావు, కొండలు, గోపీ, శంకర్‌నాయక్, రాము, భద్రాచలం, నరేష్, పాల్గొన్నారు.

అధిష్టానం గుర్తిస్తుందని ఆశిస్తున్నా..

కారేపల్లి: వైరా నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టానికి పదేండ్లుగా పనిచేస్తున్నానని, అధిష్టానం పని చేసిన వారినే గుర్తిస్తుందని ఆశిస్తున్నామని టీపీసీసీ సభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. ఆదివారం కారేపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెష్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేదరి టోనీ వీరప్రతాప్, సొసైటీ డైరెక్టర్ బాణోతు హీరాలాల్, నాయకులు ధారావత్ వినోద్, తాజుద్దీన్, గుగులోతు భీముడు, బాణోతు రాంచందర్‌నాయక్, తోటకూరి రాంబాబు, హచ్చు, బాబు, మంగీలాల్, రామారావు, కళ్యాణ్, నవీన్, రఘు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి


పంటలను పరిశీలిస్తున్న రైతుసంఘం బాధ్యులు

వైరారూరల్: వైరా రిజర్వాయర్‌కు సాగర్ జలాలు విడుదల చేసి ఆయకట్టు కింద ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లెనపాడు, అష్టగుర్తి, రెబ్బవరం గ్రామాల్లో ఆయకట్టు చివరి భూములను ఆదివారం ఆయన పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. జూలై తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు లేనందున రిజర్వాయర్ నీటి మట్టం పూర్తిస్థాయిలో తగ్గి ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. వేలాది ఎకరాల్లో వరి సాగు చేస్తున్న నేపథ్యంలో సాగర్ జలాలను విడుదల చేసి చివరి భూములకు నీరు అందించి పంటలను కాపాడాలన్నారు. తోట నాగేశ్వరరావు, కిలారు శ్రీనివాసరావు, నల్లమోతు వెంకటనారాయణ, చంద్ర ప్రసాద్, వెంపటి రాజా, నల్లమోతు రాజాబాబు, సత్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సభాస్థలి పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు రూరల్: నవంబర్1న కల్లూరులో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ ఏర్పాట్లను ముమ్మురంగా చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సభా ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటివరకు అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ కార్యకర్తలు ఆహ్వానం పలికినట్లు తెలిపారు.

40మంది బైండోవర్

ముదిగొండ: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 40మంది నాయకులను తహసీల్దార్ ఎదుట ఆదివారం బైండోవర్ చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ముమ్మరంగా తనిఖీ

తల్లాడ: తల్లాడలోని కల్లూరు రోడ్డులో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టు వద్ద ఆదివారం తనిఖీలు ముమ్మరంగా చేశారు. తనిఖీ బృందం వచ్చే పోయే వాహనాలు ఆపి తనిఖీ చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీ అధికారి ప్రసాద్, పోలీసులు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరుకావాలి

ఎర్రుపాలెం: వచ్చే నెలలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికలలో మధిర నియోజకవర్గం నుంచి సీపీఎం అభ్యర్థి పోటీ చేస్తారని, ఈ విషయమై చర్చించడానికి ఈనెల 31న మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్న సన్నాహక సమావేశానికి పార్టీ సభ్యులు, నాయకులు హాజరుకావాలని పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి


మధిర: ప్రార్థనలు నిర్వహిస్తున్న నందిని


సత్తుపల్లిరూరల్: ఇంటింటా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముదిగొండ: కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని సీఎల్‌పీనేత మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని అన్నారు. మల్లు భట్టి విక్రమార్క విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని యడవల్లి, వల్లాపురం, పండ్రేగుపల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి ప్రచారం నిర్వహించారు. యడవల్లిలోని శ్రీ యోగానందనరసింహాస్వామి వారి దేవస్థానంలో నందిని పూజలు నిర్వహించి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మోసపూరిత హామీలు ఇచ్చే బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, తాటికొండ రమేష్, మాజీ జెడ్పీటీసీ మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, నాయకులు కందిమళ్ల వీరబాబు, బిచ్చాల భిక్షం, సౌజన్య, ఝాన్సీ పాల్గొన్నారు.

చర్చిల్లో మల్లు నందిని ప్రార్థనలు

మధిర: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఆయన సతీమణి నందిని విక్రమార్క ఆదివారం పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొండితోక సుధాకర్, టీవీ రెడ్డి, మోచర్ల సురేష్, యర్రగుంట రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు కొ్రపాటి సాల్మన్‌రాజు, గోళ్ల అప్పారావు, హలావత్ వెంకటేశ్వర్లు, కాలం కృష్ణ, మున్వర్ హుస్సేన్, నరుకుళ్ల శ్రీను, రాయల కోటేశ్వరరావు, బండి గోపాల్‌రెడ్డి, కుమారి, ఫయాజ్, జొన్నలగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సత్తుపల్లి టికెట్ మాదిగ మహిళకే ఇవ్వాలి..


మాట్లాడుతున్న కత్తుల అరుణ

సత్తుపల్లిటౌన్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మాదిగ మహిళకు ఇంత వరకు ఇవ్వలేదని, సత్తుపల్లి కాంగ్రెస్ టిక్కెట్‌ను మాదిగ మహిళకు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే కత్తుల శాంతయ్య కుమార్తె కత్తుల అరుణ అన్నారు. సత్తుపల్లిలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తాను పుట్టి పెరిగి ఈ జిల్లాతో అనుబంధం ఉందని.. ప్రజల్లో నాన్న గౌరవం చూసి నమ్మకంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టానన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో తిరిగానని ప్రజల్లో మంచి స్పందన లభించిందన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి


తల్లాడ: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


కల్లూరు రూరల్: గ్రామాల్లో ప్రచారం..

తల్లాడ: సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తల్లాడ మండలంలో అభివృద్ధి చేసి చూపించండని తిరిగి మళ్లీ ఓట్లేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు అన్నారు. తల్లాడ మేజర్ పంచాయతీలో 1, 2వ వార్డులో గడపగడపకు బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రరాజు మాట్లాడుతూ... వెంకటవీరయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బొడ్డు వెంకటేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షులు జీవీఆర్, దూపాటి నరేష్ రాజు, శివ, గోవిందరావు పాల్గొన్నారు.

కల్లూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్ ప్రకటించిన మెనిఫెస్టోను ఆదివారం పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండలంలోని ఎర్రబోయినపల్లి, చెన్నూరు, చిన్నకోరుకొండి, క్రిష్ణయ్య బంజరు, పుల్లయ్య బంజర్, లోకవరం, పేరువంచ, నారాయణపురం, బత్తుల పల్లి, కప్పలబంధం తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. సండ్ర వెంకటవీరయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పాలెపు రామారావు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండి.ఇస్మాయిల్, నాయకులు రామకృష్ణ, కంప్లి, కృష్ణ, కనకారావు, సర్పంచ్‌లు శీలం సత్యనారాయణరెడ్డి, యశోద, నామారాధమ్మ, సింగిసాల పద్మ ప్రసాద్, వెంకటరెడ్డి, అనూషరెడ్డి, శ్రీనివాసరావు, రాము, రాజు, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

'రిటర్నింగ్' కార్యాలయానికి హంగులు

- హెల్ప్ డెస్క్ ఏర్పాటు


రంగులతో ముస్తాబైన సత్తుపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం

సత్తుపల్లిటౌన్: నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో సత్తుపల్లిలోని రిటర్నింగ్ కార్యాలయం హంగులు సంతరించుకుంటుంది. కార్యాలయానికి రంగులతో ముస్తాబు చేస్తున్నారు. నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ చేపడుతుండటంతో కార్యాలయం లోపల అభ్యర్థులు వేచి ఉండేందుకు ప్రత్యేక వెయిటింగ్‌హాల్‌ను సిద్ధం చేస్తున్నారు. నామినేషన్లు వేయటానికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అదనంగా ఆరు కంప్యూటర్లు, ఇద్దరు వీడియో గ్రాఫర్లతోపాటు ఇతర మండలాల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై విధులు కేటాయించారు. ప్రాంగణమంతా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

బారికేడ్ల ఏర్పాటుకు అధికారుల పరిశీలన


బారికేడ్ల ఏర్పాట్లకు మార్కింగ్ చేస్తున్న అధికారులు

నామినేషన్లు వేసే అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకే వాహనాలకు అనుమతి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆదివారం వంద మీటర్లు, 200 మీటర్లకు రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి, ఏసీపీ రామానుజం, సీఐ మోహన్‌బాబు, కమిషనర్ కె.సుజాత కలిసి మార్కింగ్ పరిశీలించారు. అదేవిధంగా రిటర్నింగ్ కార్యాలయం చుట్టూ ఏఏ ప్రాంతాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలో అధికారులు పరిశీలించారు. నామినేషన్లు వేసేందుకు అభ్యర్థితో పాటు నలుగురిని అనుమతిస్తామని రిటర్నింగ్ అధికారి అశోక్ చక్రవర్తి తెలిపారు.